పంటల బీమా టెండర్ ఎప్పుడు?

- నెల రోజులుగా సీఎం వద్దే ఫైలు
- ప్రస్తుత పంట నష్టానికి బీమా లేనట్టే
- ఏప్రిల్ పంట నష్టం ఇవ్వని సర్కార్
- సీజన్ ముగుస్తున్నా రాని 'భరోసా'
- అర్హులకు సైతం అందని రుణమాఫీ
- 15-20 లక్షల ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- కుండపోతతో ఎవుసం ఆగం
- కాలం కలిసిరాక.. ప్రభుత్వ సహకారం లేక రైతన్న అరిగోస

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఫసల్ బీమా అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల నుంచి చర్చిస్తూనే ఉన్నది. ఇప్పటివరకూ ఈ ప్రక్రియ టెండర్ వరకు వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తున్నది. అధికారులు విధి విధానాలు సిద్ధం చేసి సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు ఫైలు పంపినా.. నెల రోజులుగా అది పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. మొన్నటివరకు వర్షాలు లేక ఇబ్బంది పడిన రైతులను ఇప్పుడు కుండపోత వర్షాలు ఆగం చేస్తున్నాయి. కాగా ప్రభుత్వం పంట నష్టంపై ఇచ్చే పరిహారంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సీజన్ ముగుస్తున్నా రైతు భరోసా అందలేదు. ప్రభుత్వ సహకారం లేక, అటు కాలం కలిసిరాక రైతన్న అరిగోస పడుతున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా 15 లక్షల నుంచి 20 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయ శాఖ వర్గాల అంచనా. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్‌తోపాటు నిర్మల్ జిల్లాల్లో భారీగా పంట నష్టం జరిగినట్టు వ్యవసాయ శాఖ అంచనా వేసినట్టు తెలిసింది. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా ప్రకారం 4.15 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు దెబ్బతిన్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ప్రభుత్వ లెక్కలను రైతు సంఘాలు తప్పుపడుతున్నాయి. పరిహారాన్ని తప్పించుకోవడానికే నష్టాన్ని తక్కువగా చూపిస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. పంట నష్టంపై వాస్తవ లెక్కలు తెప్పించి, వారందరికీ సాయం చేయాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

కలిసిరాని కాలం.. దక్కని ప్రభుత్వ భరోసా

ఈ ఏడాది దెబ్బ మీద దెబ్బ మాదిరిగా కాలం కలిసిరాక, ప్రభుత్వం నుంచి భరోసా దక్కక రైతులు ఆగమైపోతున్నారు. మొన్నటివరకు వర్షాలు లేక, ఇప్పుడు కుంభవృష్టితో నష్టపోతున్నారు. ప్రభుత్వం నుంచి రైతుభరోసా దక్కక, రుణమాఫీ సరిగ్గా అమలుకాక ఇలా అన్ని విధాలుగా రైతులు ఇబ్బందిపడుతున్నారు. సకాలంలో సరైన వర్షాలు కురవకపోవడంతో గత సంవత్సరంతో పోల్చితే ఈసారి దాదాపు 10 లక్షల ఎకరాల్లో పంటల సాగు విస్తీర్ణం తగ్గింది. ఇప్పుడు కుంభవృష్టితో సాగైన పంటలు కూడా దెబ్బతింటున్నాయి. ఈ విధంగా రైతులపై ప్రకృతి పగబడితే, వారిని ఆదుకునే విషయంలో ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలొస్తున్నాయి. పంటల సాగు కోసం ఎప్పుడో జూన్‌లో ఇవ్వాల్సిన రైతుభరోసా, సీజన్ ముగుస్తున్నా అతీగతీ లేకుండా పోయింది. రుణమాఫీలోనూ కోతలు పెట్టిన ప్రభుత్వం 50% మందికే మాఫీ చేసింది. ఇప్పటివరకు 22 లక్షల మందికే మాఫీ అయినట్టు ప్రభుత్వమే చెప్తున్నది. రైతులకు ప్రకృతి చేసిన నష్టంతో పోల్చితే ప్రభుత్వం చేసిన నష్టమే ఎక్కువనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పూర్తిస్థాయిలో పంట నష్ట పరిహారంతోపాటు రైతుభరోసా చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

నాలుగు నెలలుగా నాన్చుడే

'ఈ వానకాలం సీజన్ నుంచే రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేయబోతున్నాం. పంట నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందిస్తాం..' ఇదీ పంటల బీమా పథకం అమలుపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పిన మాట. కానీ, మంత్రి మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. ఈ సీజన్‌కు పంటల బీమా అమలు లేనట్టేనని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. ఇప్పటికే ఆలస్యమైందని, రానున్న యాసంగి సీజన్ నుంచి అమలుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. దీంతో ప్రస్తుతం కురుస్తున్న కుండపోత వర్షాలతో జరిగిన పంట నష్టానికి బీమా పరిహారం దక్కే అవకాశం లేదు. ఫసల్ బీమా అమలుపై ప్రభుత్వం నాలుగు నెలల నుంచి చర్చిస్తూనే ఉన్నది. ఇప్పటివరకూ ఈ ప్రక్రియ టెండర్ వరకు వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తున్నది. అధికారులు విధి విధానాలు సిద్ధం చేసి సీఎం వద్దకు ఫైలు పంపించినట్టు తెలిసింది. నెల రోజులుగా ఆ ఫైలు పెండింగ్‌లో ఉన్నట్టు సమాచారం. వారం క్రితం సీఎం సంతకం చేసినప్పటికీ, వ్యవసాయ అధికారులు, ఆ తర్వాత మంత్రి అందుబాటులో లేకపోవడంతో ఆ ప్రక్రియ అక్కడే నిలిచిపోయింది. దీంతో ఈ సీజన్ ముగిసింది కాబట్టి వచ్చే సీజన్ నుంచే అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్టు వ్యవసాయ శాఖలో చర్చ జరుగుతున్నది.

ఏప్రిల్ పంట పరిహారం ఇవ్వని ప్రభుత్వం

ఈ ఏడాది మార్చి, ఏప్రిల్‌లో కురిసిన అకాల వర్షాలు పంటలు భారీగా దెబ్బతీశాయి. మార్చిలో కురిసిన వర్షాలతో 15,814 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు ప్రభుత్వం గుర్తించింది. ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ప్రకటించి చెల్లించింది. ఏప్రిల్‌లోనూ 3,120 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఈ రైతులకు కూడా ఎకరాకు రూ.10వేల పరిహారం చెల్లిస్తామని ప్రకటించింది. కానీ, ఇప్పటి వరకూ ఆ పరిహారాన్ని రైతులకు చెల్లించలేదు. దీంతో ప్రభుత్వం రైతులకు పరిహారం ఎగ్గొంటిందనే విమర్శలొస్తున్నాయి.

ఫసల్ బీమా లేదు.. పరిహారం రాదు

ఇప్పటికే ఫసల్ బీమాను అమలు చేసి ఉంటే రైతులకు ఈ విపత్తు సమయంలో ఎంతగానో అండగా ఉండేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎకరాకు రూ.10 వేల చొప్పున సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఈ పరిహారం ఏ మూలకు సరిపోతుందనే విమర్శలొస్తున్నాయి. ఒకవేళ ఫసల్ బీమా ఉంటే, ప్రతి రైతుకూ, ప్రతి పంటకూ జరిగిన నష్టం మేరకు పరిహారం వచ్చేదని, రైతుకు కొంత భరోసాగా ఉండేదనే అభిప్రాయాలున్నాయి. వర్షాకాలం సీజన్‌లో ఎప్పుడో ఒకప్పుడు భారీ వర్షాలు, వరదలు వస్తాయనే విషయం తెలిసినప్పటికీ, ప్రభుత్వం ముందస్తుగా పంటల బీమాను ఎందుకు అమలు చేయలేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఇంజినీరింగ్ సీట్లపై సుప్రీంకోర్టుకు

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం
- మాప్ అప్ కౌన్సెలింగ్‌ను నిర్వహించాలన్న హైకోర్టు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ సీట్లకు అనుమతినిచ్చి, మాప్ అప్ కౌన్సెలింగ్‌ను నిర్వహించాలన్న హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకెళ్లాలని సర్కారు నిర్ణయించింది. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఇందుకోసం ఢిల్లీకి వెళ్లారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ కోర్సుల్లో 3- 4 వేల సీట్లు పెంచుకునేందుకు పలు కాలేజీలకు ఏఐసీటీఈ, జేఎన్టీయూలు పచ్చజెండా ఊపాయి. వీటిలో కోర్సుల కన్వర్షన్ సహా అదనపు సీట్లున్నాయి. అయితే ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. దీంతో కాలేజీలు ఆయా సీట్లను కోల్పోయాయి. వాటిని మినహాయించే ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ద్వారా 75వేలకు పైగా బీటెక్ సీట్లను భర్తీచేసింది. అయితే ఇదే అంశాన్ని కాలేజీలు హైకోర్టులో సవాల్ చేశాయి. తొలుత కాలేజీలకు వ్యతిరేకంగా తీర్పు వచ్చినా, మళ్లీ కాలేజీలు హైకోర్టులో డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశాయి. దీంతో కాలేజీలకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆయా సీట్ల భర్తీకి మాప్ అప్ కౌన్సెలింగ్‌ను నిర్వహించాలని డివిజన్ బెంచ్ స్పష్టంచేసింది. రెండుమూడు రోజుల్లో మాప్ అప్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలవుతుందని అంతా భావించారు. అయితే ఈ తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని సర్కారు నిర్ణయించింది. దీంతో ఆయా సీట్ల భర్తీకి తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయ్యింది.

ఎంబీఏ, ఎంసీఏకు భారీ డిమాండ్

- 91 కాలేజీల్లో 100% సీట్ల భర్తీ
- 17 లోపు ఫీజు చెల్లింపునకు అవకాశం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ప్రొఫెషనల్ కోర్సుల్లో ఎంబీఏ.. ఎంసీఏ కోర్సులంటేనే ఎవర్‌గ్రీన్ కోర్సులు. ఈ కోర్సుల్లో చేరేందుకే అత్యధికులు ఆసక్తిచూపిస్తారు. కొంతకాలంగా ఈ రెండు కోర్సుల్లో చేరే వారి సంఖ్య పెరుగుతుండగా, ఈ ఏడాది సైతం అదే పునరావృతమైంది. ఎంసీఏలో 86శాతం, ఎంబీఏలో 87.5శాతం సీట్లు భర్తీ అయ్యాయి. మొదటి విడతలోనే 80శాతానికిపైగా సీట్లు భర్తీకావడం విశేషం. ఐసెట్ మొదటి విడత కౌన్సెలింగ్ సీట్లను శుక్రవారం కేటాయించారు. 34,748 సీట్లకు 30,300 సీట్లు తొలి విడతలోనే నిండాయి. 4,448 సీట్లు మిగలగా వీటిని రెండో విడతలో భర్తీచేస్తారు. 285కాలేజీలకు 91 కాలేజీల్లో వంద శాతం సీట్లు నిండాయి. 17లోపు ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని, 25 నుంచి 28వరకు సర్టిఫికెట్లను కాలేజీల్లో సమర్పించాలని సూచించారు.

ఇంటర్‌బోర్డు కార్యదర్శిగా శ్రీదేవసేన

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఇంటర్‌బోర్డు కార్యదర్శి, ఇంటర్ విద్య కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిణి శ్రీదేవసేనకు ప్రభుత్వం అదనపు బాధ్యతలప్పగించింది. ఇంతకాలం ఈ హోదాలో పనిచేసిన శృతిఓజా ఉన్నత చదువుల కోసం యూకేకు వెళ్లేందుకు ప్రభుత్వ అనుమతి కోరారు. ఇందుకు సర్కార్ అనుమతి ఇవ్వడంతో ఈనెల 16నుంచి ఏడాదిపాటు సెలవుపై వెళ్లనున్నారు. సాంకేతిక, కళాశాల విద్యాశాఖల కమిషనర్‌గా పనిచేస్తున్న శ్రీదేవసేనకు ఇంటర్‌బోర్డు కార్యదర్శి, ఇంటర్ విద్య కమిషనర్‌గా అదనపు బాధ్యతలప్పగిస్తూ సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు విడుదల చేశారు.

మాడల్ టీచర్ల బదిలీలకు మోక్షం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): మాడల్ స్కూల్ టీచర్ల బదిలీలను అధికారులు చేపట్టారు. ఇదివరకే వెబ్ ఆప్షన్లు స్వీకరించడంతో బదిలీలు చేపట్టనున్నారు. మాడల్ స్కూల్స్ టీచర్ల బదిలీలకు హైకోర్టు గురువారం పచ్చజెండా ఊపింది. స్కూళ్లలో చేరిన తేదీ ప్రకారమే ఎన్‌టైటిల్‌మెంట్ పాయింట్స్ ఇవ్వాలని ఆదేశించింది. 194 మోడల్ స్కూళ్లలో 2013, 2014లో నియామకమైన 3వేలకు పైగా ఉపాధ్యాయుల బదిలీలకు అవకాశమేర్పడింది. బదిలీల ఆప్షన్స్ ఎడిటింగ్‌కు ఒక రోజు అవకాశం కల్పించాలని పీఎంటీపీ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు తరాల జగదీశ్ ఉన్నతాధికారులను కోరారు.

అప్‌లోడ్‌చేసినా.. పాత మార్కులే

- టెట్ మార్కుల సవరణకు అభ్యర్థుల తంటాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): టెట్ మార్కుల సవరణలో కొత్త చిక్కులు వచ్చిపడ్డాయి. కొత్త మార్కులు అప్‌లోడ్ చేసినా.. ఇంకా పాత మార్కులే చూపిస్తున్నాయి. కొందరు అభ్యర్థులు సీ టెట్ మార్కులు అప్‌లోడ్ చేయగా, ఇప్పుడవి కనిపించడం లేదు. ఓ అభ్యర్థి ఈ నెల 2న అప్లికేషన్ అప్‌లోడ్ చేయగా, 129 మార్కులు చూపించింది. మూడు రోజుల క్రితం చూడగా పాత మార్కులు 91 మా ర్కులే చూపిస్తున్నది. మరో అభ్యర్థి ఎడిట్ ఆ ప్షన్‌లోకి వెళితే సబ్జెక్టు గణితం, సైన్స్ అని చూ పిస్తున్నది. వాస్తవానికి సదరు అభ్యర్థి సోషల్ స్టడీస్‌కు ఎగ్జామ్ రాశాడు. ఇక హాల్‌టికెట్ నెంబర్ ఎడిట్‌చేసుకునే అవకాశమిచ్చినా వెబ్‌సైట్‌లో ఆ అవకాశమే లేకుండా పోయింది. ఇవేకాకుండా అనేక తప్పిదాలు చోటుచేసుకున్నట్టు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. 2017 డిసెంబర్‌లో టెట్ పరీక్ష జరగలేదు. జూలై 23న జరిగింది. ఆగస్టు 4న ఫలితాలిచ్చారు. కానిప్పుడు ఎడిట్ ఆప్షన్‌లో మాత్రం 2017 డిసెంబర్ 1 అని చూపిస్తున్నది. అసలు 2017లో టెట్ జరిగిందే ఒక్కసారే. ఇలా అనేక తప్పిదాలున్నాయని, సవరించాలని డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

ఫైనల్ 'కీ'పై మరిన్ని అభ్యంతరాలు

డీఎస్సీ ఫైనల్ 'కీ'పై అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రెండు వందలకు పైగా రాగా, తాజాగా మరికొన్ని సబ్జెక్టుల ఫైనల్ కీపై అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. జూలై 18న నిర్వహించిన ఫిజికల్ సైన్స్ పేపర్‌పై అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. ప్రశ్న నెంబర్ 3 యూనైటెడ్ నేషన్స్ హ్యూమన్ క్లోనింగ్ ఒప్పందం, ప్రశ్న నెంబర్ 7, ప్రశ్న నెంబర్ 32, 47, 54, 79, 117, 129, 136,137,143 ప్రశ్నలకిచ్చిన సమాధానాలపై అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు.

'నీట్' డైలమా!

> మొదటిపేజీ తరువాయి...

కొనసాగుతున్నది. ఆలిండియా కోటా కింద రెండో రౌండ్‌కు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. కొత్తగా కాలేజీలు మంజూరైన నేపథ్యంలో గడువును పెంచారు. ఇందులో తెలంగాణ నుంచి నాలుగు కాలేజీలు ఉన్నాయి. మహేశ్వరం, మెదక్, కుత్బుల్లాపూర్, యాదాద్రిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ఆలిండియా కోటా కింద 28 సీట్లను రిజర్వ్ చేశారు. రెండో రౌండ్‌లో ఈ సీట్లను కూడా జతచేశారు. కానీ రాష్ట్రంలో కన్వీనర్ కోటా సీట్ల భర్తీ మాత్రం నిలిచిపోయింది. 'స్థానికత'ను నిర్ధారించడంలో ప్రభుత్వం విఫలం కావటం, హడావుడిగా జీవో33ను తీసుకురావటంతో అడ్మిషన్ల ప్రక్రియ న్యాయవివాదాల్లో చిక్కుకున్న సంగతి తెలిసిందే. దీంతో సొంత రాష్ట్రంలో వైద్యవిద్య చదవాలన్న వేల మంది విద్యార్థుల కల త్రిశంకుస్వర్గంలో ఊగిసలాడుతున్నది.

భరోసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం

'స్థానికత' నిర్ధారణలో తీవ్రంగా విఫలమైన తెలంగాణ వైద్యారోగ్యశాఖ.. విద్యార్థులకు భరోసా కల్పించడంలోనూ నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నది. జీవో-33పై తమ వైఖరిని, ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను విద్యార్థులకు ఎందుకు వివరించి చెప్పటం లేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. తమ తోటి విద్యార్థులకు అడ్మిషన్లు పూర్తవుతుంటే పిల్లలు మానసికంగా ఆందోళన చెందుతున్నారని వాపోతున్నారు. వాస్తవ పరిస్థితిని వివరిస్తూ 'మీ భవిష్యత్తుకు ఢోకా లేదు' అంటూ వైద్యారోగ్యశాఖ నుంచి గానీ, హెల్త్ యూనివర్సిటీ నుంచి గానీ ఒక ప్రకటన కూడా విడుదల చేయకపోవటం ఏమిటని నిలదీస్తున్నారు. యూనివర్సిటీకి వెళ్లి అడిగితే స్పందించే నాథుడే లేడని, 'మాకేం తెలియదు, హైదరాబాద్‌కు వెళ్లి అడగండి' అంటూ చేతులెత్తేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జరిగిన పరిణామాలన్నీ వివరిస్తూ, ప్రభుత్వ ఉద్దేశం ఏమిటో తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఆందోళన బాట తప్పదని స్పష్టం చేస్తున్నారు.

ఏపీలో నిరాటంకంగా అడ్మిషన్లు

'ఉమ్మడి' పాలన ముగిసిన నేపథ్యంలో స్థానికతను నిర్ధారించుకోవాల్సిన బాధ్యత ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్ మీద పడింది. ఏపీలో ప్రభుత్వం ముందుచూపుతో వ్యవహరించింది. ఫిబ్రవరిలోనే ప్రత్యేక కమిటీ వేసి స్థానికతను నిర్ధారించటంతో ఎంబీబీఎస్ అడ్మిషన్లకు ఎలాంటి ఇబ్బంది కలగటం లేదు. ప్రస్తుతం ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఆంధ్రా యూనివర్సిటీ, ఎస్వీయూ పరిధిలో మెరిట్ లిస్టును విడుదల చేశారు. వివిధ కారణాలతో స్థానికంగా ఇంటర్ చదవలేని వారికి 'ఏపీ నాన్‌లోకల్' స్టేటస్ ఇచ్చి, సీట్లలో కోటా ఇచ్చి భర్తీ చేస్తున్నారు.

మదర్ డెయిరీ హస్తగతం

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార యూనియన్ లిమిటెడ్(మదర్ డెయిరీ) హస్తగతమైంది. ఖాళీగా ఉన్న ఆరు డైరెక్టర్ స్థానాల కోసం శుక్రవారం రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్ ఎస్వీ కన్వెన్షన్‌లో ఓటిం గ్ జరిగింది. రంగారెడ్డి జిల్లాలో రెండు, యా దాద్రిలో నాలుగు స్థానాలు ఖాళీగా ఉండ గా.. మొత్తంగా 297 మంది ఓటర్లు ఉన్నా రు. యాదాద్రిలోని నాలుగు సీట్లకు కాంగ్రె స్, బీఆర్‌ఎస్ నుంచి అభ్యర్థులు బరిలో నిలిచారు. ముందుగానే కాంగ్రెస్ పార్టీ క్యాంప్ రాజకీయాలు, తాయిలాలకు తెరదీసింది. ఒక్కో ఓటరుకు రూ.30 వేల వరకు పంపిణీ చేసింది. అయినప్పటికీ బీఆర్‌ఎస్ అభ్యర్థులు హోరాహోరీ పోటీనిచ్చారు. కాగా శనివారం మదర్ డెయిరీలో చైర్మన్ ఎన్నిక జరగనున్నది. చైర్మన్‌గా ఆలేరు నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలానికి చెందిన గుడిపాటి మధుసూదన్‌రెడ్డిని ఎన్నుకోనున్నట్టు తెలిసింది.

ఇంజినీరింగ్‌కు పునర్వైభవం

- ఆరేండ్లుగా పెరుగుతున్న అడ్మిషన్లు
- నిరుటితో పోల్చితే 5వేలు అధికం

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఎమర్జింగ్ కోర్సులను ప్రవేశపెట్టడం.. సీఎస్‌ఈ కోర్సుల్లో సీట్లను పెంచడం.. కొత్త బ్రాంచీలకు అనుమతులివ్వడంతో రాష్ట్రంలో ఇంజినీరింగ్ విద్య పునర్వైభవాన్ని సంతరించుకుంటున్నది. ఆరేండ్లుగా బీటెక్ ఫస్టియర్ అడ్మిషన్లు (28,973) గణనీయంగా పెరుగుతున్నాయి. అడ్మిషన్లు ఐదేండ్ల గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2019తో పోల్చితే 2024కు వచ్చేసరికి 38శాతం అడ్మిషన్లు పెరగడం విశేషం. 2019లో బీటెక్ అడ్మిషన్ల సంఖ్య 49 వేల లోపే.. కానిప్పుడు 75వేలు దాటింది. గతం ఒలో 60శాతం కూడా నిండని పరిస్థితి ఉండే.. కానిప్పుడు 86శాతం సీట్లు నిండాయి. బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. దీంతో భారీగా ఉద్యోగాల కల్పన జరగడంతో ఇంజినీరింగ్ కోర్సులు తిరిగి పుంజుకుంటున్నాయి. పైగా ఇక్కడి కాలేజీల్లో ఎమర్జింగ్ కోర్సులు, ఉద్యోగావకాశాలున్న కోర్సులను ప్రవేశపెడుతున్నారు. కేసీఆర్ సర్కారు హయాంలో నాలుగు జేఎన్టీయూ కాలేజీలను ఏర్పాటు చేసి, డ్యూయల్ డిగ్రీ కోర్సులు, ఆనర్స్, మైనర్ కోర్సులను ప్రవేశ పెట్టారు. 70శాతం ఆఫ్‌లైన్, 30 శాతం ఆన్‌లైన్ కోర్సును చదువుకునే వెసులుబాటు కల్పించారు. 86,943 సీట్లల్లో 61వేల సీట్లు సీఎస్‌ఈ తత్సమాన కోర్సులకు సంబంధించినవే ఉన్నాయి. జాతీయంగా సీఎస్‌ఈ సీట్లల్లో 25శాతం మన దగ్గరే ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఐటీ రంగంలో మాంద్యం ప్రభావమున్నా.. మన విద్యార్థులు మాత్రం ఐటీ కొలువులే లక్ష్యంగా బీటెక్ కోర్సుల్లోనే చేరుతున్నారు. కంపెనీలు ఏర్పాటవుతుండటం.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగడం.. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో మంచి ప్యాకేజీలతో ఇప్పుడు విద్యార్థులందరి దారి బీటెక్ వైపే కనిపిస్తున్నది.

కన్వీనర్ కోటా సీట్ల భర్తీ వివరాలిలా..

సంవత్సరం	కాలేజీలు	మొత్తం సీట్లు	భర్తీ అయిన సీట్లు	అడ్మిషన్ల పెరుగుదల
2019	183	65,565	46,134	----
2020	181	70,135	47,739	1,605
2021	175	79,822	57,545	9806
2022	177	79,448	62,170	4,625
2023	174	82,702	70,689	8,519
2024	175	86,943	75,107	11,836

ఈ ఏడాది విభాగాల వారీగా అడ్మిషన్లు

విభాగం	మొత్తం సీట్లు	భర్తీ అయినవి (శాతం)
సీఎస్‌ఈ, ఐటీ	61,587	57,637 (93.59)
ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్	16,692	12,672(75.92)
సివిల్, మెకానికల్ తత్సమాన	7,458	4,081(54.72)
ఇతర విభాగాల్లో	1,206	717 (86.39)

స్కూల్ గ్రాంట్ విడుదల

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): సర్కారు స్కూళ్ల రోజువారీ నిర్వహణ ఖర్చుల కోసం పాఠశాల విద్యాశాఖ నిధులు మంజూరుచేసింది. 50శాతం స్కూల్, స్పోర్ట్స్ గ్రాంట్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలోని 21,342 స్కూళ్లకు 50శాతం కాంపొజిట్ స్కూల్ గ్రాంట్ రూ. 48 కోట్లు, స్పోర్ట్స్ గ్రాంట్ రూ.12కోట్లు విడుదల చేస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి ఉత్తర్వులిచ్చారు. నాలుగు మాసాలుగా స్కూల్, స్పోర్ట్స్ గ్రాంట్ నిధులు మంజూరు విడుదల చేయకపోవడంతో ఇటీవలే నమస్తే తెలంగాణలో 'చాక్‌పీసులు, డస్టర్లు కొనేందుకు డబ్బుల్లేవి' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. జూలైలోనే 50శాతం గ్రాంట్‌ను మంజూరుచేసిన విషయాన్ని ప్రస్తావించింది. దీంతో స్పందించిన విద్యాశాఖ తాజాగా స్కూల్, స్పోర్ట్స్ గ్రాంట్ నిధులను మంజూరుచేసింది.

ప్రజాభవన్‌లో కాంట్రాక్ట్ అధ్యాపకుల ధర్నా

ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ అధ్యాపకులు శుక్రవారం ప్రజాభవన్‌లో ధర్నా చేపట్టారు. హక్కులను ప్రభుత్వం కాలరాస్తున్నదని, తమను క్రమబద్ధీకరించకపోతే ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. ధర్నా సందర్భంగా ఒత్తిడికి గురైన మహిళను సమీప దవాఖానకు తరలించారు. – హైదరాబాద్ సిటీబ్యూరో

ఎనిమిది నెలలుగా జీతాల్లేవ్..

ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని, ప్రభుత్వమే న్యాయం చేయాలంటూ ఈఎస్‌ఐ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. న్యూబోయిగూడలోని ఈఎస్‌ఐ డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ జీతాలు రాకపోవడంతో ఇంటి కిరాయి, పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. అవుట్ సోర్సింగ్ విధానాన్ని తొలగించి, రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేశారు. – బన్సీలాల్‌పేట్



హైదర్‌గూడలోని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద ప్రభుత్వ వాహనానికి అడ్డంగా పడుకొని నిరసన తెలుపుతున్న సర్పంచుల సంఘం జేఏసీ

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ధర్నా

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. హైదరాబాద్ హైదర్‌గూడలోని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట మాజీ సర్పంచులు శుక్రవారం నిరసన చేపట్టారు. ప్రభుత్వ వాహనానికి అడ్డంగా పడుకొని రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12,769 గ్రామాల్లో 2019-24 పీరియడ్‌లో అనేక అభివృద్ధి పనులు చేశామని, ఫలితంగా రికార్డుస్థాయిలో గ్రామాలకు జాతీయ అవార్డులు వచ్చాయని గుర్తుచేశారు. అభివృద్ధి పనుల బిల్లు లు రాక, అప్పుల పాలైన సర్పంచులు పలువురు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాకే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్‌రెడ్డి, నాయకులు రాంపాక నాగయ్య, మెడబోయిన గణేశ్, సముద్రాల రమేశ్, మల్లయ్య, బీరప్ప, నవీన్‌రావు పాల్గొన్నారు.

అధికారుల తప్పిదం.. విద్యార్థి పాలిట శాపం

- అర్హతలున్నా స్పోర్ట్స్ కోటాలో బీటెక్ సీటు నిరాకరణ
- 'శాట్స్' నిర్లక్ష్యంతో చెస్ క్రీడాకారుడికి అన్యాయం
- న్యాయం చేయాలని కోరుతున్న విద్యార్థి శ్రీశ్వాన్

హైదరాబాద్, సెప్టెంబర్ 13(నమస్తే తెలంగాణ): ఆ విద్యార్థి ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్, ఏషియన్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్స్, కామన్‌వెల్త్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. చదువుల్లోనూ ప్రతిభావంతుడైన ఆ విద్యార్థి ఎప్‌సెట్‌లో టాప్ ర్యాంక్ కాలేజీల్లో సీటు వస్తుందని ఆశపడ్డాడు. కానీ స్పోర్ట్స్ అథారిటీ అధికారుల తప్పిదంతో అనామక కాలేజీల్లో సీటు పొందాల్సి వస్తుంది. నిజామాబాద్ జిల్లా రెంజల్‌కు చెందిన శ్రీశ్వాన్ మరలాక్షరి 2019లో అండర్-14 ఏషియన్ ఇంటర్నేషనల్ యూత్ చెస్ పోటీల్లో గోల్డ్ మెడల్, అదే ఏడాది వరల్డ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. కామన్‌వెల్త్ గేమ్స్‌ల్లోనూ పతకాలు కొల్లగొట్టాడు. ఇంటర్ పూర్తి చేసిన శ్రీశ్వాన్ ఎంసెట్‌లో 15,784 ర్యాంకు సాధించాడు. స్పోర్ట్స్ కోటా కింద టాప్ కాలేజీల్లో సీటు వస్తుందనే నమ్మకంతో జూలై 6న కౌన్సెలింగ్‌కు హాజరయ్యాడు. కానీ సాంకేతిక విద్యా మండలి అధికారులు స్పోర్ట్స్ కోటా వర్తించదని తేల్చిచెప్పారు. దీంతో స్పోర్ట్స్ అథారిటీ అధికారులను సంప్రదించగా, వారు కూడా అభ్యంతరాలు వ్యక్తంచేశారు. దీంతో కోర్టును ఆశ్రయించగా, శ్రీశ్వాన్‌కు స్పోర్ట్స్ కోటా కింద సీటు ఇవ్వాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల కాపీతో పలుమార్లు సాంకేతిక విద్యామండలి అధికారులను కలిశారు. అయితే టాప్ కాలేజీల్లో సీట్లు భర్తీ అయ్యాయని, వేరే కాలేజీల్లో సీటు ఇస్తామని చెబుతున్నారు. నిబంధనల ప్రకారం ఎస్‌జీఎఫ్ క్రీడల్లో రాణించిన విద్యార్థులకు స్పోర్ట్స్ కోటాలో టాప్ ర్యాంకు కాలేజీల్లో ప్రవేశం కల్పించాలని శ్రీశ్వాన్ పేర్కొంటున్నాడు. ప్రతి విషయంలో స్పోర్ట్స్ అధికారులు పొరపాటు చేసి తననెలా శిక్షిస్తారని ప్రశ్నిస్తున్నాడు. స్క్రీనింగ్ కమిటీ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో తనకు టాప్ కాలేజీల్లో సీటు రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు. టాప్ కాలేజీల్లో సీట్లు అయిపోగా, స్పోర్ట్స్ కోటాలో 39 సీట్లు మిగలాయి. దీంతో ఆదిలాబాద్, సూర్యాపేటల్లోని కాలేజీల్లో సీట్లను తీసుకోమంటున్నారని, ఇదేం న్యాయమని ప్రశ్నిస్తున్నాడు. సాంకేతిక మండలి, స్పోర్ట్స్ అథారిటీ అధికారుల తీరుతో అన్యాయం జరిగిందని వాపోతున్నాడు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నాడు.

'రిటైర్డ్' బెనిఫిట్స్‌లో నిర్లక్ష్యం

- సోషల్ వెల్ఫేర్ గురుకుల సొసైటీలో 6 నెలల్లో 56 మంది ఉద్యోగ విరమణ
- ఇప్పటికీ ఏజీ ఆఫీస్‌కు వివరాలు పంపని వైనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

హైదరాబాద్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీలో 6 నెలల్లో 53 మంది ఉద్యోగులు ఉద్యోగ విరమణ పొందారు. విరమణ పొందే సమయంలో ఉద్యోగికి జీతం, సేవా వ్యవధి ఆధారంగా ఒకేసారి గ్రాట్యూటీ, పెన్షన్, కమ్యుటేషన్ ఆఫ్ పెన్షన్ చెల్లించడంతోపాటు లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. వివరాలన్నీ క్రోడీకరించి వాటి మంజూరు కోసం ఆ పత్రాలను ఏజీ(ఆడిటర్ జనరల్) కార్యాలయానికి సంబంధిత శాఖ అధికారులే సమర్పించాల్సి ఉంటుంది. ఏజీ ఆమోదం తరువాత ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌కు వెళ్లి అనుమతి పొందిన అనంతరం నిధుల విడుదలతోపాటు నెలవారీ పెన్షన్ కూడా మంజూరవుతుంది. ఉద్యోగి విరమణ పొందడానికి 6 నెలల ముందు నుంచే అన్ని శాఖల్లో అధికారులు ఈ ప్రక్రియను ప్రారంభిస్తారు. కానీ, సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. ఆరు నెలలైనా విరమణ ఉద్యోగుల పెన్షన్ ప్రపోజల్స్‌ను సొసైటీ ఉన్నతాధికారులు ఏజీ కార్యాలయానికి పంపలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. విషయాన్ని సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సొసైటీ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తమకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.